దుక్కిటెద్దు

"వద్దు, వద్దు! నాకు డాక్టరొద్దు! రెండు రోజులుంటే అదే నిమ్మళిస్తుంది!" అన్నాడు కిష్టయ్య, ఆయాసంగా.

"అదేమిటి, నాన్నగారూ? అదే నయం కావటమేమిటి? అసలు జబ్బేమిటో తెలుసుకోనివ్వండి. ముందుగా జాగర్తపడాలిగాని, రోగం ముదర బెట్టుకుంటారా?" అన్నది అనసూయ. ఆమె పిల్లలు నలుగురూ ఆమె చుట్టూ నిలుచున్నారు.

"పిల్లలకోడి" అని కిష్టయ్య తన కూతురికి ఏనాడో పేరుపెట్టుకున్నాడు. కాని ఆయన ఆ మాట ఎప్పుడూ పైకి అనలేదు. ఆయన పెళ్ళాంతోగాని, పిల్లలతోగాని అనని విషయాలు, ఇటువంటివి, ఇంకా బోలెడున్నై.... అనసూయకు పిల్లలకోడి అని పేరు పెట్టుకున్నాక, ఆవిడ పిల్లల్ని వెంటేసుకుని ఇంట్లో కనిపించినప్పుడల్లా కిష్టయ్యకు నవ్వొచ్చేది. ఒకసారి అనసూయ గమనించి, "ఏమిటి, నాన్నా, నవ్వుతున్నావు?" అని అడిగింది.

"ఏం లేదు, ఏంలేదు! ఏదో జ్ఞాపకం వచ్చింది" అన్నాడు కిష్టయ్య.

అనసూయ నమ్మలేదు. ఆమెది అసలే అనుమానం మనసు. పిల్లలతల్లి అయికూడా పుట్టింటిని విడవకుండా ఉండటమేకాదు, తల్లిదండ్రులుగాని, అన్నదమ్ములుగాని తనకు ఏలోపం చేసిపోతారో అని వెయ్యికళ్ళతో కనిపెట్టి ఉండేది. అనుమానించటానికి ఏమాత్రం అవకాశం దొరికినా సూటీపోటీ మాటలని సాధించేది. ఎన్నో ప్రమాణాలూ, క్షమాపణలూ అయినదాకా వొదిలేదికాదు. తన నోటికి ఇంటిల్లిపాదీ వెరుస్తారన్న నమ్మకం ఒకటి ఆమెకు గొప్ప అండగా ఉంటూవస్తున్నది....

తండ్రి తనను చూసే నవ్వాడన్న అనుమానం పోలేదు. కాని ఏం చెయ్యలేక కుడిచేతికి అందిన కొడుకుని ఒక్కటిపెట్టి, "పదా!" అన్నది. నోట్లోనుంచి తాపీగా వేలుతీసేసి, నింపాదిగా కళ్ళుమూసి, నోరు బార్లా తెరచి బావురుమన్నాడు. నలుగురు పిల్లల్నీ వెంటబెట్టుకుని అనసూయ అవతలికి వెళ్ళిపోయింది.

"ఉపగ్రహాలు!" అనుకున్నాడు కిష్టయ్య, అనసూయ పిల్లలకు కొత్త నామకరణం చేసుకుంటూ.

ఒకప్పుడు కిష్టయ్య తన భార్యను గురించీ, పిల్లల్ని గురించీ మురిసినవాడే. ఆయన

చిన్నతనంలో కష్టాలు పడ్డాడు. ఆయన తన తల్లి నెరగడు. తం(డి రెండో పెళ్ళి చేసుకున్నాడు. మారుతల్లి కిష్టయ్యని చాలా హీనంగా చూసేది. వాళ్ళ పల్లెటూళ్ళో ఇంగ్లీషు బడి లేదు. బస్తీ చదువు డబ్బు దండగన్నది మారుతల్లి. తం(డి కాదనలేదు. కిష్టయ్య – పదేళ్ళవాడు – ఇంట్లో చెప్పకుండా బస్తీకి వెళ్ళి వారాలు చేసుకుని, పుస్తకాలు, జీతం డబ్బులు, ఇతరులు పారేసిన బట్టలు ముష్టెత్తి చదువుకున్నాడు. తాను మేజరై తం(డితో ఆస్తి పంపకం చేసుకునేసరికి కిష్టయ్య చదువు అయేపోయింది. ఇతరుల్ని మంచి చేసుకునే విద్య కిష్టయ్య చిన్నతనం నుంచీ విధిగా అలవరచుకున్నాడు. "మంచివాడు" అనిపించుకోవటం, ఇతరులను ఏ మాత్రమూ నొప్పించకుండా వారి పూర్తి సహకారం పొందటం, పొందిన సహాయానికి రెట్టింపు కృతజ్ఞత చూపటం ఆయనకు బాగా అలవాటైపోయింది. ఇదే ఆయనకు ఉద్యోగంలో పైకిరావటానికి కూడా ఎంతో ఉపకరించింది. చదివినది స్కూలు ఫైనలే అయినా పెళ్ళి అయేనాటికి అప్పుడే నూరు రూపాయలు – ఆ రోజుల్లో బియ్యేలు కూడా చెయ్యలేని సంపాదన – సంపాదిస్తున్నాడు.

భార్య కాపరానికి వచ్చాక కిష్టయ్య ఆనందానికి మితిలేదు. "తన" అన్న మనిషంటూ కిష్టయ్య ఎరగడు. ఇప్పుడాయనకు ఒక భార్యా, సహజీవనమూ, తన యిష్ట(పకారం ఇల్లు అమర్చుకోవటం, వంటచేయించుకు తినడం ఏర్పాటయింది. పిల్లలు పుట్టుకొచ్చారు – ఇద్దరు కొడుకులూ, ఒక కూతురూ, మళ్ళీ ముగ్గురు కొడుకులూనూ. తన భార్యనూ, ఆరుగురు పిల్లల్నీ తనకు సాధ్యమైనంతగా సుఖపెడతానని కిష్టయ్య శపథం చేసుకున్నాడు. వాళ్ళ కేలోటూ రాకూడదని రెండు చేతులా సంపాదించాడు. అదనంగా రెండు రూపాయలు సంపాదించటానికి రెండు పూటలు తిండిలేకుండా తిరగ వలసి వస్తే తిరిగాడు.

కిష్టయ్య ఏళ్ళతరబడి దుక్కిటెద్దులాగా పని చేశాడు. ఎన్ని వ్యాపారాలలోనో భాగం తీసుకున్నాడు. ఆ వ్యాపారాలు దండగపాలు కాకుండా తానే స్వయంగా పై పెట్టున ఉండి నడిపాడు. దీనిఫలితం, కిష్టయ్య తప్ప,అందరూ అనుభవించారు. కిష్టయ్య పెళ్ళాం నూరు రూపాయలకు తక్కువ చీర కట్టి బయటికి పొయ్యేదికాదు. కిష్టయ్య కొడుకులకు చదువు సంధ్యలు అబ్బినా, అబ్బకపోయినా సరికొత్త ఫాషన్‌లో దుస్తులు ధరించటం, మోటారు సైకిళ్ళెక్కి తిరగటం, టెన్నిస్ ఆడటం మొదలైనవన్నీ అబ్బినై.

పెద్దవాడు చిన్న టెన్నిస్ ఛాంపియన్. వాడికి స్పోర్ట్స్ (పపంచం తప్ప, ఇంకేమీ తెలీదు. తాను ఉద్యోగం చెయ్యబోవటంలేదని వాడు చదువుతూండగానే (పకటించాడు. రెండోవాడు ఇంజనీరు చదివి, జంషెడ్పూరులో ఉద్యోగం సంపాదించాడు. వాడిభార్య లక్షాధికార్ల బిడ్డ. ఆవిడ తాహతుకు తగినట్టుగా బతకటానికి తం(డి దగ్గరనుంచి (పతినెలా వందా, రెండువందలు తెప్పించుకుంటాడు. మూడోవాడికి చీట్లాటపిచ్చి, అందులో వాడు

సంపాదిస్తాడని ప్రతీతి. కాని వాడికింద కిష్టయ్య ఏటా నాలుగైదు వేలు ఖర్చు చేస్తూనే ఉన్నాడు. నాలుగోవాడికి సినిమాస్టారు కావాలని. వాడు స్కూలు ఫైనల్‌తో చదువు ఆపేశాడు. చదవరా అని కిష్టయ్య అంటే, "నీవు చదివినంత నేనూ చదివాను. సినిమాస్టారు ఛాన్సురానీ, నీకన్న ఎక్కువే సంపాదిస్తాను" అనేవాడు. అయిదోవాడు మటుకు చదువుతున్నాడింకా.

అనసూయకు పదోఏటనే పెళ్ళిచేశాడు - శారదా చట్టాన్ని ధిక్కరించి. బాగా ఉన్నవాళ్ళ పిల్లవాణ్ణే చూసి చేశారు. అనసూయను మొగుడి దగ్గరికి పంపిన కొద్ది రోజులకే ఆమె అత్తవారి ఆస్తంతా అప్పుల వాళ్ళ పాలయింది. డిప్రెషన్ వాళ్ళమీద పెద్ద దెబ్బ తీసింది. "మహాతల్లి మెట్టిన వేళావిశేషం ఎటువంటిదో, లక్షరూపాయల ఆస్తి సోదిలోకి రాకుండా పోయింది!" అని అనసూయ వింటుండగా అత్తవారు అన్నారు. అనసూయ అప్పటికప్పుడే పెట్టేబేడా సర్దుకుని పుట్టింటికి బయలుదేరి వచ్చేసింది. మళ్ళా అత్తవారింటి మొహం చూడలేదు. ఒక వారం రోజులు వెనకగా అనసూయ భర్త కామేశ్వరరావు కూడా వచ్చేశాడు.

"కాపరానికి వచ్చాడు అల్లుడు" అనుకున్నాడు కిష్టయ్య తనలో తాను ఆనందపడుతూ.

కామేశ్వర్రావంటే ఎందుకో కిష్టయ్యకు మొదటినుంచీ కూడా మంటే! ఈ మంటకు పెద్దకారణాల్లేవు. ఉన్నవన్నీ అతి చిన్న కారణాలు. గొప్పచెప్పుకుంటాడు. అబద్ధాలాడుతాడు, పెళ్ళామంటే అంతులేని అపేక్ష అభినయిస్తాడు. ఈ అభినయాన్ని కిష్టయ్య ఏనాడూ నమ్మలేదు. మరి మిగిలినవాళ్ళంతా నమ్మారు.

అనసూయకు చాలారోజులు పిల్లలు లేక వరసగా నలుగురు పుట్టుకొచ్చారు. కిష్టయ్య వాళ్ళందర్నీ పగవాళ్ళల్లే చూసేవాడు. కొడుకుల పిల్లలూ, కూతురి పిల్లలూ డజనుమందిదాకా ఉన్నారు. వాళ్ళల్లో ఎవరు కనిపించినా కిష్టయ్యకు జెర్రులు పాకినట్లుండేది. "లంకంత ఇల్లున్నది! వీళ్ళు నేనున్నచోటికే ఎందుకువస్తారో?" అనుకునేవాడు.

కిష్టయ్యకు మనుషులంటే అసహ్యం, మనవలతో మనవరాళ్ళతో ఆరంభం కాలేదు; పెళ్ళాం పిల్లలతో ఆరంభమయింది. వాళ్ళు ఆయనను డబ్బు సంపాదించే యంత్రంగా చూడసాగారు. డబ్బు కావలిసివస్తేనే తన దగ్గిరికి వచ్చేవాళ్ళు. డబ్బు దేనికో తెలుసుకుందామని తాను ఎప్పుడన్నా విచారిస్తే చెప్పటానికి విసుక్కునేవాళ్ళు. ఒక్క కామేశ్వర్రావే తన దగ్గిరికి వచ్చి కూచుని ఏవేవో వ్యాపారాలను గురించి గంటల తరబడి మాట్లాడేవాడు. చివరకు, రెండువేలు మూడువేలు పెట్టుబడి కావాలని బయటపెట్టేవాడు.

తను ఏపూటా సరిగా వేళకు భోంచేసేవాడు కాదు కిష్టయ్య. కాని దానికి అందరూ అలవాటు పడిపోయారు. ఒకరాత్రి పన్నెండు గంటలకు ఇంటికివస్తే అందరూ

నిద్రపోతున్నారు. "భోజనం చేస్తావా?" అని అడిగినవాళ్ళులేరు. అన్నం పెట్టమని అడిగితే పెట్టేవాళ్ళే. ఎందుకో కిష్టయ్యకు అడగబుద్ధికాలేదు. భోజనం చెయ్యకుండానే పడుకున్నాడు.

ఇంట్లో కిష్టయ్య తప్ప మిగిలిన వాళ్ళందరిమధ్యా ఏవో బంధాలున్నాయి. వాళ్ళు ఆప్యాయంగా మాట్లాడుకునేవాళ్ళు. అంతలో చడామడా తిట్టుకునేవాళ్ళు. కాని వాళ్ళ మధ్య కిష్టయ్యకు ఏమీ స్థానంలేదు.

"వీళ్ళందరికోసం నేనెందుకు హూనం కావాలి. నాతిండికీ బట్టకూ యాభైచాలు, నాకు నస్యంకూడా అలవాటు లేదు" అని కిష్టయ్య చాలాసార్లు అనుకున్నాడు. కాని దొర్లేరాయి దొర్లుతూనే ఉంది. సగం ఈ మూకను మరిచిపోవటానికే పైపనులు పెట్టుకున్నాడు. ఎప్పుడైనా పెందలాడే ఇంటికి వచ్చినా, ఇల్లుదాటి పోకపోయినా ఏదో ఆత్మద్రోహం చేసినట్టుగా తోచేది.

"ఈవాళ తాత ఇంట్లోనే ఉన్నాడే!" అనేవాళ్ళు కుర్రాళ్ళు. అందులో కిష్టయ్యకి ఏదో వెటకారం వినిపించేది. తరవాత కాస్సేపటికి ఇంకెవరో వచ్చి గోడల్ని అడిగినట్టుగా, "ఈవేళ నాన్న ఎక్కడికీ పోలేదల్లే ఉందే!" అనేవాళ్ళు. ఆఖరుకు అసలావిడ, "వెళ్ళారనుకున్నా. ఉన్నారా?" అనేది.

ఇంట్లో ఎవరికీ తను అవసరంలేదని తెలుసుకోవడానికి కిష్టయ్యకు చాలాకాలం పట్టింది. తాను ఏదైనా మాట్లాడినప్పుడు ఎవరూ సాంతం వినేవారుకారు. ఇది గమనించినాక కిష్టయ్య అనేక డజన్లసార్లు రుజువు చేసుకున్నాడు. కాని ఎవరితోనూ ఈమాట అనలేదు.

కిష్టయ్యకి మరీ మంట ఎత్తింది దేనికంటే, తాను అనేకమంది సహాయం పొందాడు. కాని వారందరికీ తన కృతజ్ఞత చూపాడు. ఈ మూక తనవల్ల ఇంత సహాయం పొందుతూ కూడా తన కష్టసుఖాలు ఎందుకు విచారించరు? తనకు యాభై ఎనిమిదో ఏడు. ప్రభుత్వోద్యోగం చేసినట్టయితే పింఛను పుచ్చుకుని సుఖపడవలసిన వయసు. అదంతా లేకపోగా ఎంత తెచ్చినా చాలదు. ఎంత ఇచ్చినా ఇంకా ఇమ్మనే మాట. డబ్బు ఇవ్వటానికి తప్ప మిగిలిన అన్ని విషయాలకూ తాను పరాయివాడే.

కిష్టయ్యకు జబ్బుచేసింది. ఆరోగ్యం చెడింది. చెడదూ? విధీవిరామంలేకుండా పనిచేస్తుంటే ఎంతకాలం ఆరోగ్యం ఉంటుంది? అందులోనూ ఈ వయసులో.

"ఈసారి నేను చచ్చిపోతాను!" అనుకున్నాడు కిష్టయ్య. ఈ జబ్బునుంచి ఆయనకు కోలుకోవాలని లేదు. ఈ అవతారం ఇక చాలించవచ్చు ననిపించింది.

కాని మిగిలినవాళ్ళకు ఆయనను చావనివ్వాలని ఏ కోశానా లేదు. డాక్టరును పిలవనంపారు. తనకు డాక్టరు అవసరం లేదన్నాడు కిష్టయ్య.

డాక్టరు రానేవచ్చాడు. పరీక్ష చేశాడు. విశ్రాంతి తీసుకోమన్నాడు. ఏవో ఇంజెక్షన్లూ టానిక్కులూ రాసి ఇచ్చాడు.

"డబ్బు దండగ, నాబతుకుఎట్లా ఆరంభమయిందో అట్లాగే ముగుస్తుంది. నా అనేవాళ్ళు లేకుండా. నా బతుకు నేను బతికినప్పుడు ఏ డాక్టరూ నాకు ఇంజక్షనిస్తాననలేదు. ఎందుకంటే అప్పుడు డబ్బులేదు. ఇప్పుడు డబ్బుందిగనక డాక్టర్ల చేతి కొచ్చిన మందులల్లా రాసిస్తారు. అవి ఏమీ చెయ్యలేవు" అనుకున్నాడు కిష్టయ్య.

కాని ఇంజెక్షన్లు పనిచేశాయి. విశ్రాంతి కూడా కొంత పనిచేసిందేమో? కిష్టయ్య మంచంలో లేచి కూచుంటే అందరి ముఖాలూ విప్పారినై.

"బంగారుగుడ్లు పెట్టే కోడి చావలేదని ఎంత సంతోషం!" అనుకున్నాడు కిష్టయ్య.

లేడికి లేచిందే ప్రయాణం. కాస్త ఆరోగ్యం కుదుటపడగానే కిష్టయ్యకు ఏమీ చెయ్యకుండా ఉండటం దుర్భరమనిపించింది. అథమం ఏదన్నా చదువుదామనుకున్నాడు. అనసూయ ఆఖరు కొడుకు కనిపిస్తే వాణ్ణి పిలిచి, "చదువుకునేందుకు ఏదన్నా పత్రారా?" అని అడిగాడు.

వాడు వెళ్ళి ఏదో పత్రిక తెచ్చి యిచ్చాడు. కిష్టయ్య పేజీలు తిరగేస్తూ, "పట్టి చెత్త! ఇహమూ, పరమూ లేని రాతలు!" అనుకున్నాడు. అకస్మాత్తుగా ఆయన దృష్టి కొన్ని పద్యాలమీద పడింది. పద్యాలకు "దుక్కిటెద్దు" అని శీర్షిక ఉంది. దాని కింద తన ఆఖరు కొడుకు పేరుంది.

'వీడు తిక్కన సోమయాజి అని నేను ఎరగనే!' అనుకుంటూ కిష్టయ్య పద్యాలు చదవసాగాడు. పొలాల మొహం ఎరగని తన ఆఖరు కొడుకు దుక్కిటెద్దు గురించి పద్యాలు రాయటమేమిటి?

కాని కుర్రాడు, కిష్టయ్య అనుకున్నంత తెలివితక్కువవాడు కాడు. వాడు తానెరిగిన దుక్కి టెద్దు గురించే రాశాడు. ఆ దుక్కిటెద్దుకు జీవించటం చేతకాదు. తన కష్టసుఖాలను ఇంకొకరితో పంచుకోదు. ఇతరుల కోసం అస్తమానం శ్రమపడి వాళ్ళను సోమరిపోతులను చేసి, వారంతా తనకు రుణపడి ఉన్నారని సంతోషిస్తుంది. వాళ్ళు తనకు కృతజ్ఞత చూపటంలేదని మనసులో బాధపడుతుంది. క్రమంగా దాని హృదయంలో అపేక్ష, అంతఃకరణలకు చోటుండదు. ఆఖరుకు కోపం వచ్చి కొమ్ము విసరటం కూడా చాతగాని స్థితిలోపడి చావుకోసం ఎదురుచూడ సాగుతుంది.

కిష్టయ్య ఆఖరు కొడుకు కొద్దిపాటి హాస్యధోరణిలో రాసిన అయిదు పద్యాల సారాంశమూ ఇంతే.

"ఓరి పిడుగా!" అనుకున్నాడు కిష్టయ్య. కిష్టయ్యలో కొద్దిపాటి హాస్యం ఉంది. అది ఎవరికీ వశపడ నిచ్చేవాడు కాడు. అదే తనకొడుక్కుకూడా సంక్రమించింది. వాడుకూడా పైకి హాస్యం ఉన్నట్టు కనిపించడు.

అనసూయ గ్లాసులో పళ్ళరసం తెచ్చింది.

"ప్రతిపూటా నాకు పంచదార తక్కువవుతున్నది!"అంటూ గొణిగాడు కిష్టయ్య.

"తక్కువైతే అడిగి వేయించుకోరాదూ?" అన్నది అనసూయ ఆశ్చర్యంగా.

"అదే దుక్కిటెద్దు లక్షణం!" అన్నాడు కిష్టయ్య.

"ఏమిటీ?" అన్నది అనసూయ, అయోమయంగా.

"ఏం లేదులే! పిల్లల్నందర్నీ ఒకసారి పంపించు."

"దేనికి?"

"దేనికేమిటి? పంపించమంటుంటే!"

అనసూయ తల అడ్డంగా ఆడించి వెళ్ళిపోయింది.

కాస్సేపటికి ఏడెనిమిదిమంది పిల్లలు కిష్టయ్య గదిలోకి వచ్చి కుక్కిన పేలల్లే నిలబడ్డారు.

"చదవండి, నా వెంట!" అంటూ "దుక్కిటెద్దు" పద్యాలు వాళ్ళచేత చదివించాడు. వాళ్ళు మొదట బెరుకు బెరుకుగా చదివారుగాని రాను రాను గొంతులు హెచ్చినై.

తండ్రి పంచదార కావాలని అడిగినమాట మరచిపోయిన అనసూయ తిరిగి జ్ఞాపకం తెచ్చుకుని పంచదారసీసా, చంచా పట్టుకుని వచ్చేసరికి కిష్టయ్య గది వీథి బడిలాగా ఉంది. పిల్లలంతా కప్పెగిరిపోయేట్టు తాతవెంట పద్యాలు చదువుతున్నారు. పళ్ళరసం గ్లాసు పక్కనే బల్లమీద ఖాళీగా పెట్టి ఉంది. దాని అడుగున చూచాడు. పంచదార కరిగీ కరగకుండా మిగిలి ఉన్నది.

"పంచదార చాలా ఎక్కువేశావ్!" అన్నాడు కిష్టయ్య అనసూయకేసి చూడకుండానే.

పిల్లలు "దుక్కిటెద్దు" గోలగా చదువుతూనే ఉన్నారు. అవి వాళ్ళకు అప్పుడే కంఠతా వచ్చేశాయి.

ముద్రణ: దుక్కిటెద్దు, కథల సంపుటి, 1955 - 59 మధ్య?

జయా పబ్లికేషన్స్, విజయవాడ